నేను లేవదీశాను. "వద్దు సత్యం! ఇది ఒక్క దండంతో పోయేది కాదు. నువ్వు మా లేబర్ కాలనీలో వుంటూ, మనందరికీ "కన్నతల్లి" ఈ ఫ్యాక్టరీ నీడలో పిల్లల్ని, పాపల్ని కంటూ వుంటానన్న వాగ్దానం మా అందరికీ చెయ్యి" అన్నాను.

నాకింకా అతనిమీదనమ్మకం కుదరలేదు. సత్యం కళ్ళు ఎత్తి చూశాడు. ఆ కనుకొలుకుల నీరు నిల్చింది. అవి ఆనంద భాష్పాలే అనుకున్నాను నేను! వాటినే వాగ్దానంగా స్వీకరించాను.

* * *

## సుమతి

ప్రార్థనై పోయింది. ప్రయివేట్ పాఠశాల గనుక పిల్లలంతా వరుసగా క్లాసుల్లోకి చడీ చప్పుడూ లేకుండా వచ్చేశారు.

సుమతి హాజరుపట్టి తీసి పేర్లు పిలుస్తూంటే—నీలం తొడిమలున్న తెల్లని పువ్వుల్లాంటి పసిపాపలు లేచి చేతులు కట్టుకుని నిలబడి—"ప్రెజెంట్ టీచర్", "యస్ మాడమ్" అంటూ అటెండెన్సు పలికి కూర్చున్నారు.

నలభై రెండు పేర్లూ పూర్తయ్యేసరికి సుమతి మొహం మీద చిన్న పిసరు విసుగు కనపడ్డది.

పాఠం మొదలెట్టాలంటే చిరాగ్గా వుంది...ఉదయం ఇంటిదగ్గర అమ్మతో జరిగిన పోట్లాటే యింకా గుండెల్లో పుండులాగ సలుపుతున్నది.

పిల్లల్ని చూసింది. మూలగా కూర్చున్న రమణి, కాంచన—ఏమిటో గుసగుస లాడుకుంటున్నారు. సుమతికి చికాకుని వెళ్ళగ్రక్కేందికి మార్గం దొరికింది....“ఏయ్! యూ ఫూల్స్! సైలెన్స అండ్ స్టాండప్—” అంది.

ఇద్దరూ లేచారు—నోరిప్పి “అదికాదు మేడమ్” అని ఏదో అనబోయారు కాని సుమతి స్కేలు అందుకుని నిలబడే సరికి గప్‌చిప్ అయిపోయారు. పాఠం చెప్పడంకన్నా హోం వర్కులు చూస్తే పోతుంది అనుకుంది.

“రమణీ! హోమ్‌వర్క్ బుక్స అన్నీ కలెక్ట్ చేసి బల్లమీద పెట్టు” అంది. రమణి ‘మానిటర్’ అన్నమాట.... వెంటనే లేచి హోమ్‌వర్క్ పుస్తకాలన్నీ దబాయించి మరీ తోటిపిల్లల దగ్గర తీసుకుంటోంది.

సుమతి అప్రయత్నంగా నిట్టూర్చింది. ఈక్లాసే నయం. ఇంటికన్నా-ప్రొద్దున్న తను పదేళ్ళున్న తమ్ముణ్ణి వీధిచివర నున్న దుకాణంలో “సేఫ్టీ పిన్స తేరా” అంటే—“తేనుపో” అన్నాడు. “వెధవా” అని అలవాటుగా స్కేలు ఎత్తి ఒకటి వెయ్యబోతే “ఇదేం నీ క్లాస్‌రూం కాదే తల్లీ” అంటూ అమ్మ వాణ్ని వెనకేసుకొచ్చింది.

“ఎందుకే నీకంత కోపం నామీద? రోజూ ఆరుగంటలు ఆ స్కూల్లో ఒళ్ళు హూనం చేసుకుని వస్తున్నాననా?” అన్నది తను. దానికి అమ్మ “ఎవరు చేసుకోమన్నారు నీ

వాళ్ళు హయానం? నాన్నగారు తెచ్చిన సంబంధం ఏదీ నచ్చదు నీకు. నీకు కావాలన్న ఇంజనీర్, డాక్టర్‌లాంటి సంబంధాలు తేడానికి మీ తాత ముత్తాతలు వదలి పోయిన ముల్లె ఏమీ లేదు మనకి" అన్నది అమ్మ.

"అందుకని రెండో పెళ్ళాడికి కట్టబెడతావా నన్ను?" తను మండిపడ్డది.

"ఇంకా నాలుగేళ్ళు యిలాగే ఉద్యోగం చేస్తూవుంటే రెండో పెళ్ళాడుకూడా రాడే నీకూ....అంతా ఖర్మ! ఇదిగో సేఫ్టీ పిన్ను" అంటూ అమ్మ తన జాకెట్టుకున్న పిన్ను తీసి అక్కడ పడేసింది.

ఆ పిన్ను పెట్టి పొడిచినట్లు ఫీలయింది తను...

"ఛీ! ఇంత చదువు చదివాను. ఇదే మగపిల్లాడైతే మురిసి చద్దురు...." అనుకుంటూ తను టిఫిన్ బాక్స్ పట్టుకుని బయటికి వచ్చింది.

ఒక అందమైన యువకుడు స్కూటర్ మీద వెళ్ళుతూ ఎదురొచ్చాడు. 'శకునం మంచిదే' అనుకుంది. కాస్త మనసుకు ప్రశాంతత చిక్కించుకుంది.

"మాడమ్! ఇవిగో బుక్స్‌లు" అన్న రమణి మాటలకి ఉలిక్కిపడి, వాటిలో ఒకదాన్ని అందుకుంటూ "బుక్సులు కాదు బుక్స్" అని మాట సరిదిద్దింది.

లెక్కలు-పాపం ఇంటిదగ్గర అమ్మా నాన్నా చేయించి పంపిన లెక్కలు-ఓ పాప - రెండు తొమ్ముదులు పద్దెనిమిది అనే వేసింది. కానీ సుమతి లెక్కల హోంవర్క్ దిద్దేటప్పుడు ప్రతి బుక్ కీ రెండు ఇంటూలు, మూడు రైట్లు అన్న పద్ధతి

పెట్టుకుంది-పని సులువుగా అయిపోవడాన్కి. ఆ లెక్కన ఆ పాపకి ఇంటూ పెట్టాల్సింది ఆ లెక్కమీదే కనుక రైటే అయినా చూడకుండానే ఇంటూ పెట్టేసింది.

పుస్తకంమీద రిమార్కులు రాస్తే బాగా చదువు చెపుతున్నారు అనుకుంటారు పేరెంట్స్ అని సుమతి పని చేస్తున్న ఆ ప్రయివేట్ స్కూల్ హెడ్ మాస్టరమ్మ (మిస్ట్రెస్- అంటే ఆవిడకి దుఃఖం- నేనెవరికి మిస్ట్రెస్‌ని కాను-హెచ్. ఎమ్. గారనండి అంటుంది) తరచు టీచర్లకి చెబుతూ వుంటుంది.

అందుకనే ఓ పాప పుస్తకంలో అక్షరములు సరిగా లేవు. ఇంటివద్ద శ్రద్ధవహించవలెను' అని రాసింది. మరో పుస్తకంమీద 'పుస్తకములు నీటుగా వుంచవలెను' అని రాసింది. ఇంకో బుక్ మీద 'ఇంప్రూవ్ హాండ్ రైటింగ్' అని ఇంగ్లీషులో రాసింది మూడో క్లాస్ టీచరమ్మ సుమతి!

అందరికీ పుస్తకాలు అందజేసి, హోంవర్కు చేసుకుని రానివాళ్ళని విచారించింది.

"మా అమ్మగారు రాత్రి మా యింటికి చుట్టాలొచ్చారని చెప్పమన్నారండీ" అన్నాడు ఓ చిన్నారి.

"అయితే నువ్వు హోంవర్కు చెయ్యడం మానెయ్యాల ఎందుకు?" సుమతి స్కేలు ఝుళిపిస్తూ ప్రశ్నించింది.

"మరి మా మమ్మీయేకదాండి లెక్కలు చెబుతుంది" అన్నాడు వాడు.

"సరే నువ్వు 'సిట్ డవున్'- రేపు పావలా ఫైన్‌పట్రా. హుఁ...." అని గద్దించింది. ఆ పసివాడు మోకాళ్ళమీద పడ్డాడు వెంటనే చేతులు కట్టుకుని.

మరో పాప పుస్తకంలో తన రిమార్కు క్రింద ఆ పిల్ల తల్లి రాసిన రిమార్కు చూసింది-"రెండు రెళ్ళు నాలుగేనని ఎక్కాల పుస్తకంలో వుంది. మూడు కాదు. స్కూల్‌లో శ్రద్ధ వహించవలెను" అని వుంది.

"ఏమిటిది? మేం ఇంటూ పెట్టిన లెక్కని మళ్ళీ వెరిఫై చేయడమేగాక బోడి రిమార్కు కూడానా? ఏం చదువుకుందో ఈ మహాతల్లి" అని ఆ నోట్స్ గల పాపని పిలిచింది. రెండు చేతులమీద రెండేసి దెబ్బలు కొట్టింది.

"ఇంకెప్పుడూ ఇలా రాయించుకు రాకు...స్కూల్ నుంచి డిబార్ చేయించేస్తాను. నేను చాలా స్ట్రిక్టు" అంది. ఆ పిల్ల పేరు నిర్మల నిర్మల బ్యార్‌మని బాకా మొదలెట్టింది డిబార్ అంటే ఏమిటో తెలియక.

"ఏమిటాగోల ఛి ఛీ! అబ్బబ్బ! వందరూపాయల రసీదు మీద సంతకం పెట్టి 80 రూపాయలు తీసుకుంటూ ఈ పిల్లలికి నే చదువులు చెప్పలేను తల్లీ!" అని విసుక్కుంటూ "హోల్ క్లాస్ స్టాండప్" అన్నది కోపంగా. ఆ కోపం స్కూలు యాజమాన్యం మీద, ఆ స్కూలు హెడ్మాస్టరమ్మమీదే. కాని పిల్లలికి శిక్ష పడ్డది!

పాఠం మొదలెట్టి సుమతి ఎలాగో చెపుతోంది.... అంతలో "అమ్మా హెచ్. ఎం. గారు రమ్మంటున్నారు" అంటూ ఆయా వచ్చింది.

"ఏం కొంప మునిగిందిటా" అనుకుంటూ బయలు దేరింది - వెళ్తూ వెళ్తూ 'మానిటర్'తో ఎవరైనా కిక్కురు మంటే చాలు పేర్లెక్కించు. నేను వచ్చి వాళ్ళ భరతం పడ తాను....హోల్ క్లాస్ స్టాండప్" అని అరిచింది.

హెచ్. ఎం. గారంటే సుమతికే కాను, ఆ స్కూల్లో పని చేస్తున్న పదిమంది అమ్మాయిలకీ హడలే!

హెచ్. ఎం. సుందరి, సుమతిని తన సోడాగ్లాసు కళ్ళ దాలలోంచి తీక్షణంగా చూసి..."ఏమ్మా! సుమతీ! తెలుగు పేపర్లు మీా క్లాసువి నువ్వు దిద్దలేదా?" అనడిగి సుమతి ఏదో చెప్పబోయే లోగానే "నువ్వు దిద్దలేదు- నాకు తెల్సు - మానిటర్ చేత దిద్దించి క్రింద చిన్న సంతకాలు పారేశావు- ఔనా?" అని గద్దించింది.

కాదనడానికి వీలులేదు. "టెస్టు పేపర్లు మనం దిద్దక్కర లేదు. ఎవడు చూశాడు? వాళ్ళ పిల్లలపోరు ఇళ్ళకాడ పడ లేక మనమీాదికి తోలేస్తారు తల్లిదండ్రులు. కనుక క్లాసులో పోయినేడాది ఫెయిలయి, కొంచెం యేపుగా వున్న సీనియర్ స్టూడెంట్ చేత దిద్దించెయ్ పేపర్లు" అని సీనియర్ తెలుగు పండిట్ ఆచార్లుగారే సలహాయిచ్చాడు - మునుపోసారి. ఆ స్కూల్‌కి ఆ ముసిలాయన ఒక్కడే ముసలి మగదిక్కు మరి!

"పేరెంట్స్ దగ్గరనుండి కంప్లెయింట్స్ ఎక్కువయి నాయి మిస్ సుమతీ! అందరూ కాకపోయినా కొందరయినా మంచి స్టాటస్‌లో వున్నవాళ్ళు మన స్కూలు కమిటీ మెంబర్ల ఫ్రెండ్స్ వుంటారుగా....సో, బీ కేర్‌ఫుల్—వాళ్ళు కట్టేది పదిహేను రూపాయలే కానీ వందలూ, వేలూ యిస్తున్నట్లు

గోలచేస్తారు కొందరు పేరెంట్స్" అంది హెచ్. ఎమ్. గారు. ఆవిడకు తెలుసు- మిడిల్ క్లాస్ కుటుంబాలు కట్టే పదులు, పదిహేనులమీద మొత్తం స్టాఫ్ జీతాలు, కమిటీ మెంబర్ల కమీషన్‌లూ అన్నీ వస్తున్నాయి అని. కానీ 'విద్యాదానం' చేస్తున్నాము అనే భావించుకుని ఉపన్యాసాలు దంచేస్తూంటుందామె.

సుమతి పిల్లిలాగయిపోయింది. హెచ్. ఎమ్. నోటి దురుసుతనానికి ఝడిసిపోయింది.

అంతలో ఒక గడ్డం మాసిన; పంచే, బనియను మనిషి వచ్చాడు. చూడ్డానికి కూలివాడిలాగే వున్నాడు.

"దండాలమ్మా!" అన్నాడు హెచ్.ఎమ్ ని చూసి— ఆమెపోల్చింది. "నువ్వా సోమయ్యా! ఫీజుకడదామనివచ్చావా? పోయి గుమాస్తాదగ్గిర ఇచ్చెయ్" అంది సుందరి.

"అది కాదండీ! ఇంకా ఎన్ని దినాలు గడువుందండీ.... అది కనుక్కుందామని...." అంటూ నసిగాడు సోమయ్య.

"ఫైనుతో నయితే ఇరవై దాకా టైముంది...ఇవాళ ఇవాళ....(కేలండర్ చూసి) పదమూడేగా" అంటూ "ఫో" అంది దర్పంగా హెచ్. ఎమ్.

"సిత్తం! ఐతే రొండురోజులు వరుసాగ్గా 'డే', 'నైటూ' బండేసుకుంటే సరిపోద్దమ్మా"—అన్నాడు తన బనీను జేబులో వున్న ఆరు రూపాయలు తడుముకుని తీస్తూ సోమయ్య—

సుమతి రిక్షా అబ్బి సోమయ్య మాటలు విని విస్తుపోయింది. "ఈ రిక్షావాడు రెక్కలు ముక్కలు చేసుకుని, నెలకి పాతిక రూపాయలనుంచి ఏభై రూపాయలదాకా

ఖర్చయ్యే ప్రయివేట్ స్కూలుకి కొడుకుని పంపుతున్నాడా? మ్యునిసిపల్ స్కూల్లో పాలూ, రొట్టే యిస్తున్నారుగా-వుచితంగా చదువుచెప్పి మరీ—తెలీదేమో పాపం!" అనుకుంది. కాని సోమయ్యకి తెల్సు—ఐనా తన కొడుక్కి నిజంగా చదువు రావాలి. వాడు మాంచి వుద్యోగం చెయ్యాలి అని సోమయ్య కోరిక—అందుకే రెక్కలు ముక్కలు చేసుకుంటున్నాడు.

"మావాడు - పోలయ్య ఎట్టా సదుంతున్నాడమ్మా?" సోమయ్య ప్రశ్న.

సోమయ్యని కూర్చోమనలేదు సుందరి. సాధారణంగా పేరెంట్స్ మరీ డాబుగా స్కూటర్‌మీదో, కారుమీదో వచ్చినవాళ్ళనైతే తప్ప ఆవిడ కూర్చోమనదు.

"సుమతీ! మీ క్లాసులోనే వున్నాడు పోలయ్య-తెల్సుగా వాళ్ళ నాన్న సోమయ్య యితను - వాళ్ళ కుర్రాడు బాగా చదువుతున్నాడా?" సుందరి సుమతికి సోమయ్యని చూపించి ప్రశ్నించింది.

"దండాలమ్మా!" సోమయ్య కృతజ్ఞత కళ్ళల్లో తొణికిసలాడగా అన్నాడు సుమతివేపు తిరిగి.

"పోలయ్య నోట్‌బుక్స్ అన్నీ కొనలేదుమామ్!" అంది సుమతి రిపోర్ట్ వాణ్ని-అతనికి కొడుకు చదువుమీద గల మక్కువని చూస్తున్న సుమతి మనసు మరింత వికలమైపోయింది.

ఆ పోలయ్య పుస్తకంలోనే చాలోసార్లు తాను ఇంగ్లీషులో రిమార్కులు రాసింది. "పాపం" అనుకుంది.

సోమయ్య అన్నాడు- "పంపిత్తానమ్మగోరూ! ఈ నెల కూసిన్ని ఎక్కువ అప్పులై పోనాయి - జీతం కట్టేసినాకా పొస్తకాలు అన్నీ కొనిస్తా....ఇప్పటికే ఏపై రూపాయలై నాయమ్మగోరూ" అంటూ - సుందరివైపు ఫిర్యాదు చేస్తున్నట్లు చూశాడు.

"సర్లే! సర్లే! బాగా చదివిస్తాంలే నువ్వు పో" అంది అధికార స్వరంతో సుందరి.

"ఇయిగోనమ్మా ఆడి రిచ్చా ఆర్రూపాయలు" సోమయ్య నలిగిపోయిన పాత నోట్లు మడతలు విప్పి వరుసగా పెట్టి అందించాడు సుందరికి.

"నీ రిక్షాలోనే దింపుకోరాదూ-ఈ రిక్షాఫీజు ఎందుకూ దండగా?" సుందరి నోట్లు అందుకుంటూ ప్రశ్న వేసింది.

"వద్దులేమ్మా! స్కూలు రిచ్చా అంటేనే ఆడికి సరదా! నా బండైతే ఆడి ఫ్రేండ్సులో ఆడికి నామర్దా— వెళ్ళొత్తానమ్మా....సెంటరుకి పోతే బాడుగ తగులుద్ది"... అంటూ సోమయ్య యిద్దరు టీచర్లకి దండాలు పెట్టి వెళ్ళి పోయాడు.

* * *

క్లాసుకు తిరిగి వచ్చిన సుమతి మనసంతా వికలమై పోయింది. ఏదో తప్పుచేసినట్లుంది. "పోలయ్యా!" అని కేకే సింది. క్లాసు మొత్తాన్ని సిట్ డౌన్ అని ఆదేశిస్తూ.

"ఏంటమ్మగారు" పోలయ్య ముందుకు వచ్చి చేతులు కట్టుకున్నాడు. నీలంలాగు, తెల్లచొక్కా, బూట్లు, తెల్లని

మేజోళ్ళు—వాడి చెవినో ఇత్తడి కాడ వుంది తప్ప క్లాసులో తతిమ్మా పిల్లలందరిలాగే పోలయ్యకూడా అందంగా మెరిసి పోతున్నాడు....

"బాగా చదువుకో పోలయ్యా!" అంది సుమతి వాడి తల నిమిరి. తలమీద ఆమె చెయ్యి వెయ్యబోతుంటే వాడు జంకాడు, మొట్టికాయ వేస్తున్నదేమో నని - కాని టీచర్ యింత ఆప్యాయంగా నిమరడంతో వాడి మొహం చాటం తయింది.

"ఇదుగో టీచర్!" అంటూ వాడు అర్ధరూపాయి తీసి యిచ్చాడు.

"ఎందుకూ?" అంది సుమతి చకితురాలై సంకోచిస్తూ.

"నోటుసులన్నీ లేకపోతే అర్ధరూపాయి ఫైన్ అన్నారుగా...మా అయ్య వైను కట్టేయమన్నాడు. నోటుసులు ఆనక కొంటాడంట" అన్నాడు వాడు గుక్కతిప్పుకోకుండా.

సుమతి నీరుగారిపోయింది. "సారీ పోలయ్యా! నువ్వీ అర్ధరూపాయితో ఎల్లుండి స్వాతంత్ర్య దినోత్సవంనాడు జండా కొనుక్కో" అంటూ వాడిచ్చిన అర్ధరూపాయిని తిరిగి వాడి జేబులో వేసింది. "గో అండ్ సిట్ డౌన్" అంది.

ఆ క్షణంలో, దేశ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో స్కూల్లో తాను చెయ్యాల్సిన ఉపన్యాసం కాగితం డ్రాయర్ సొరుగులో వున్నట్లు జ్ఞాపకం వచ్చింది. డ్రాయర్ సొరుగు లాగి కాగితం తీసుకొని అంతా చదివి, చివర మరో వాక్యం చేర్చు కుంది సుమతి. అది యిది: "ఈ చిన్నారి బాలలు ఈ దేశ పౌరులై ఓటు వేసేటంత వారయ్యేసరికి మన దేశం స్వాతంత్ర్య

స్వర్ణోత్సవాలు జరుపుకుంటూ వుంటుంది....అరోజు "మా మూడో క్లాసు మాస్టరమ్మ ఎక్కడుందోనని ఒక్కసారి నాగుర్తించి తల్చుకునే విధంగా - ఈ చిన్నారి బాలలకి నేను చదువు చెపుతానని శపథం తీసుకుంటున్నాను" అంటూ ఒ వాక్యం చేర్చి తృప్తిగా, భారంగా నిట్టూర్చింది.

ఒళ్ళంతా జలదరించింది సుమతికి. "జెండా లెగురవేసేది నాయకులే అయినా, రేపటి దేశాన్ని నడిపించే చిన్నారి చేతులే తన ఎదుట క్లాసులో వున్నాయి. వాటిని స్వాతంత్ర్య స్వర్ణోత్సవానికి ఆయత్తం చేయాలంటే "నా నిరాశా నిస్పృహాలు వాళ్ళమీద పడనివ్వకూడదు" అనుకుంది గట్టిగా. "మీరంతా 'సిట్ డవున్'గా పాఠాలు చదువుకోండి - ఇవాళ మీ టీచర్ బెల్ కొట్టేదాకా ఇలాగే 'స్టాండప్'గా వుంటుంది". అంది సుమతి - తనకి తానే శిక్ష వేసుకున్నట్టు!

టీచరమ్మ మాటలు పిల్లలికి అర్థం కాలేదు. కాని బెల్ కొట్టేదాకా అలాగే నిలబడ్డ సుమతి, బి. ఏ. కి మాత్రం మనసు తేలికై పోయింది. క్లాసుమీద ఎనలేని మక్కువ, మమకారం ఏర్పడ్డాయి.

.... సమాప్తం ....